క్లుప్తంగా

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం రేపు

కోటవురట్ల: మండల పరిషత్ సర్వసభ్య బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. విలేకరులతో మాట్లాడుతూ మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ శింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన శాఖల వారీ సమీక్ష జరుగుతుందని తెలిపారు.

భవిత కేంద్రానికి ఎస్‌బీఐ వితరణ



భవిత కేంద్రానికి కుర్చీలు,నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఎస్‌బీఐ మేనేజర్ శ్రీవల్లి

మునగపాక : దివ్యాంగ పిల్లలు కష్టపడి చదువుకోవాలని మునగపాక ఎస్‌బీఐ మేనేజర్ శ్రీ వల్లి కోరారు. ఎస్‌బీఐ స్థాపించి 69 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్థానిక భవిత కేంద్రం పిల్లలకు అనువుగా ఉండేలా కుర్చీలు,నోట్ పుస్తకాలు,పెన్నులను ఆమె సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీ వల్లి మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. చదువులో రాణించాలని ఆకాంక్షించారు. భవిత కేంద్రం ఉపాధ్యాయులు సుమతి, విజయేశ్వర్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి సమస్యలు

- జనసేన రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్

నక్కపల్లి: జనసేన రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ సోమవారం నక్కపల్లిలో పలువురు జనసేన కార్యకర్తలను కలిసారు. పార్టీ కార్యాలయం వద్ద నక్కపల్లి, ఉపమాక, రాజయ్యపేట గ్రామాలకు చెందిన కార్యకర్తలు కలసి తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను శివదత్ దృష్టికి తీసుకు వచ్చారు, కార్యకర్తలు తీసుకు వచ్చిన సమస్యలు రాష్ట్ర హోంమంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని శివదత్ హామీ ఇచ్చారు.

4న మండల సమావేశం

యలమంచిలి : ఈ నెల 4న యలమంచిలి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో అప్పలనాయుడు సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించిన జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించడం జరుగుతుందని సమావేశానికి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావలసిందిగా కోరారు.

నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

అచ్యుతాపురం : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుని పునరుద్ధరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి సోమునాయుడు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని అచ్యుతాపురం, దోసూరు, కొండకర్ల గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. గౌరవ అధ్యక్షులు ఆర్.రాము, మణికంఠ భవన నిర్మాణ కార్మిక సంఘం, రాజాన అప్పలనాయుడు, గాలి పైడిరాజు, హరి, వసంత అప్పారావు పాల్గొన్నారు.

ప్రమాద మృతునికి కుటుంబానికి ప్రగడ వితరణ



లక్ష్మణ్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం: మండలానికి చెందిన పంచదార్ల లక్ష్మణ్ కుటుంబాన్ని నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ ప్రగడ నాగేశ్వరరావు సోమవారం పరామర్శించారు. ఇటీవల పాడేరు జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మణ్ కుటుంబానికి ప్రగడ నాగేశ్వరరావు చేతుల మీదుగా 25 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.

మళ్లీ పడిగాపులే..



పింఛన్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ లంక సూర్యనారాయణ

- ప్రారంభమైన పింఛన్ల పంపిణీ
- సాంకేతిక ఇబ్బందులతో పంపిణీలో జాప్యం
- ఒకేచోట 20 నుంచి 30 మందికి పంపిణీ

కోటవురట్ల: ధామిట్ కథ అడ్డం తిరిగింది..మళ్లీ ఇంకో ఐదేళ్లు పింఛను డబ్బులు కోసం పడిగాపులు కాయాల్సిందేనా..ప్రస్తుతం పలువురు పింఛనుదారుల బుర్రలో సుడులు తిరుగుతున్న ఆలోచన, ఆందోళన ఇదే..ప్రభుత్వం మారింది. పింఛను డబ్బులు అందుకోవలసిన రోజు రానే వచ్చింది. పొద్దున్నే చేతిలో డబ్బులు పడితే ఆ ఆనందమే వేరు. అయితే సమయం గడుస్తున్నా ఇంటికి ఎవరూ రాలేదు. పింఛను డబ్బులు ఇవ్వలేదు. మరెలా అంటూ వాకపు చేస్తే రామకోవెల దగ్గరికి వచ్చేమన్నారు తొందరగా రా అంటూ చల్లటి కబురు తెలిసింది. తీరా అక్కడికెళ్లాక తన లాగే చాలా మంది అక్కడ పింఛను డబ్బులు కోసం ఎదురు చూస్తున్నారు. సరిగ్గా ఐదేళ్ల క్రితం రోజులు గుర్తుకొచ్చాయి. పంచాయతీ కార్యాలయం వద్ద ఎండలో సెక్రటరీ కోసం ఎదురుచూపులు జ్ఞాపకం వచ్చాయి. మళ్లీ ఆ రోజులు వచ్చేశాయన్నమాట ఇదీ పింఛనుదారుల మదిలో పరిపరివిధాల ఆలోచన. మండలంలో సోమవారం పింఛను పంపిణీని 25 గ్రామ పంచాయతీలలో అట్టహాసంగా ప్రారంభించారు. టీడీపీ, జనసేన నాయకుల ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది పింఛను నగదు అందించారు. పలు గ్రామాలలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లకుండా అందరినీ ఓ చోటకు రమ్మని పింఛను డబ్బులు ఇచ్చారు. నీలిగుంటలో మొదట టీడీపీ నాయకుడి ఇంటి దగ్గర పంపిణీ చేసి ఆ తర్వాత రామకోవెలకు అందరినీ రమ్మని అక్కడ పంపిణీ చేశారు. దాంతో వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఐదేళ్లుగా పింఛను తెల్లారేసరికి ఇంటిదగ్గరే అందేది. ఎవరైనా అనారోగ్యంతో విశాఖ, కాకినాడ, రాజమండ్రి తదితర ప్రాంతాలలో చికిత్స పొందుతున్నా వలంటీర్లు దూరాభారం ఆలోచించకుండా వాళ్ల దగ్గరికే పింఛను డబ్బులు పట్టుకెళ్లి ఇచ్చేవారు. ప్రభుత్వం మారడంతో కొత్త కష్టాలు మొదలయ్యాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాతబకాయిలు కొద్దిమందికే...

నక్కపల్లి : వివిధ వర్గాల వారికి ఇచ్చే సామాజిక పింఛన్ల పంపిణీ సోమవారం ప్రారంభమయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రస్తుతం ఇచ్చే పింఛను రూ.3 వేల నుంచి నాలుగు వేల రూపాయలకు పెంచుతానని, అలాగే ఏప్రిల్ నుంచి పెంచిన పింఛను అందజేస్తామని చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే. కూటమి అధికారంలోకి రావడంతో జూలై నెల నుంచి పెంచిన పింఛన్ల బట్వాడా ప్రారంభమైంది. వృద్ధులు, వితంతువులు, చేనేత కార్మికులు, మత్స్యకారులు, గీత కార్మికులకు పింఛన్లు నాలుగువేల రూపాయలతో పాటు, గడచిన మూడునెలల బకాయిలు కలిసి రూ.7 వేల చొప్పున సోమవారం ఉదయంనుంచి పంపిణీ ప్రారంభించారు. నక్కపల్లి మండలంలో ప్రతినెలా 12,316 మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. పింఛన్ల పెంపు విషయంలో కూడా గందరగోళం నెలకొంది. పింఛన్ల పెంపు, ఎరియర్స్‌ను అందరికీ వర్తింపజేయలేదు. వృద్ధులు, వితంతువులు, నేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, డప్పుకళాకారులు, ట్రాన్స్ జెండర్లు, హెచ్‌ఐవీ బాధితులు , రంగస్థల కళాకారులకు మాత్రం పెంచిన పింఛన్లు నాలుగువేలతో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి మరో మూడు వేల రూపాయలు కలిపి రూ.7 వేల చొప్పున చెల్లించారు. వికలాంగులకు ,కుష్టువ్యాధి కలిగిన వారికి మాత్రం పింఛను రెట్టింపు చేసి రూ.6 వేల చొప్పున చెల్లించారు. మిగిలిన వారితోపాటు వీరికి పాతబకాయిలు చెల్లించాల్సి వస్తే గనుక రూ.13వేలు చొప్పున చెల్లించాలి. కానీ పాతబకాయిలు వికలాంగులు, కుష్టు వ్యాధిగ్రస్తులకు చెల్లించకపోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక పూర్తిగా మంచాన పడిన వారు, పక్షవాతంతో బాధపడే వారికి, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడేవారికి గుండెకు సంబంధించిన వ్యాధులతో బాధపడేవారికి, బోదకాలు తదితర వ్యాధులతో బాదపడేవారికి ప్రస్తుతం రూ.5 వేలు చెల్లిస్తుండగా వారికి అదనంగా పదివేలు కలిపి రూ.15 వేలు చొప్పున చెల్లించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పింఛన్ల పంపిణీని వలంటీర్ల ద్వారా చెల్లించడం జరిగేది. వలంటీర్లు ఉదయం ఐదు గంటలకే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను అందజేసేవారు. కూటమి ప్రభుత్వం మాత్రం వలంటీర్లతో కాకుండా సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే జూనియర్ అసిస్టెంట్లు, ఎంఈవో కార్యాలయంలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పంపిణీ చేయించారు. ఇలా చేయడం వల్ల సాంకేతికపరమైన సమస్యలు ఏర్పడి పంపిణీలో జాప్యం జరిగింది. పింఛన్ల కోసం లబ్ధిదారులు గ్రామాల్లో ఉన్న సచివాలయాలు, రామాలయాలు, ప్రధాన కూడళ్ల వద్ద పడిగాపులు పడాల్సి వచ్చింది. ఒకే చోట 20 నుంచి 30 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. నక్కపల్లిలో మండల టీడీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, రాజయ్యపేటలో జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, ఉపమాకలో దేవస్థానం మాజీ చైర్మన్ కె.బుజ్జి, దేవవరంలో మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ, వివిధ గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తెలుగు దేశం పార్టీ నాయకుల సమక్షంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, పరిపాలనాధికారి సీతారామరాజు, ఈవోపీఆర్‌డీ సత్యనారాయణలు పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెంకులరాజు, కేవీ, మీగడ సత్తిబాబు, కోసూరు శ్రీను, కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మునగపాకలో సర్వర్ డౌన్ కారణంగా పింఛన్ కోసం వేచి ఉన్న లబ్ధిదారులు



కొండవారపాలెంలో ఒకేచోట పింఛను ఇస్తున్న సచివాలయ ఉద్యోగి

తొలిరోజు 86 శాతమే..

పాయకరావుపేట : మండలంలో గల 24 గ్రామాల్లోను సోమవారం పంపిణీ చేసిన సామాజిక పింఛన్లు 86 శాతం పూర్తయినట్లు ఈవోఆర్‌డీ సిహెచ్. చంద్రశేఖర్ తెలిపారు. మండలంలో 13,137 మంది పింఛను లబ్ధిదారులు ఉండగా వీరిలో సోమవారం 11,535 మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు. పింఛన్లు పంపిణీ చేసే ప్రభుత్వ సిబ్బందితో కూటమి నాయకులు కూడా పాల్గొన్నారు. జెడ్పీటీసీ లంక సూర్యనారాయణ లింగాలకాలనీలో పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉమ్మలాడలో ఎమ్మెల్యే చేతుల మీదుగా.....

మునగపాక: అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్‌లు అందజేస్తామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పేర్కొన్నారు. మండలంలోని తోటాడ,ఉమ్మలాడ గ్రామాల్లో సోమవారం ఆయన పింఛన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మన్మథరావు, కూటమి నేతలు టెక్కలి పరశురామ్, శ్రీనివాసరావు, ముసిలినాయుడు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఉమ్మలాడలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మొరాయించిన సర్వర్లు

సర్వర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో పింఛన్ తీసుకునేందుకు లబ్దిదారులు సోమవారం ఇబ్బందులు పడ్డారు. వర్షం కురవడంతో సర్వర్లు సక్రమంగా పనిచేయలేదు. దీంతో కూటమి నేతలు కొన్ని చోట్ల ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందజేసినప్పటికీ పలు చోట్ల అందరినీ ఒకే దగ్గరకు వచ్చేలా ఏర్పాట్లు చేశారు. అయితే సాంకేతిక సమస్య కారణంగా లబ్దిదారులు పింఛన్‌ల కోసం ఉదయం నుంచి వేచి ఉండాల్సి వచ్చింది. ఇంటింటికీ పింఛన్‌లు అందజేస్తామని చెప్పిన ప్రభుత్వ పెద్దలు ఇలా పడిగాపులు కాసేలా చేయడం పట్ల పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

అచ్యుతాపురం : మండలంలోని పలు గ్రామాల్లో పింఛను పంపిణీ కార్యక్రమం చేపట్టారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో కూటమి నేతలు, సచివాలయ సిబ్బందితో కలిసి పింఛను సొమ్మును ఏడు వేల రూపాయల చొప్పున అందజేశారు. రామన్నపాలెంలో డ్రీమ్స్ నాయుడు చేతుల మీదుగా పింఛను అందజేశారు. , మడుతూరులో జనసేన జిల్లా కార్యదర్శి మోటూరు శ్రీవేణి, టీడీపీ నాయకులు శనివాడ ఆనందరావు చేతుల మీదుగా పింఛను అందజేశారు.

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో సోమవారం పింఛన్ల పంపిణీ జరిగింది. కచ్చితంగా ఇంటింటికీ వెళ్లి పింఛను అందించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చినా రాంబిల్లి మండలంలో చాలా గ్రామాల్లో దానిని అమలు చేయలేదు. ఒకే చోటకు లబ్ధిదారులను రమ్మని పింఛను అందజేశారు. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. ఇంటింటికీ అందే పింఛను ఒకే ప్రదేశం వద్ద వెళ్లి గంటల తరబడి వేచి ఉండడం అన్యాయమని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

సీడీసీ చైర్మన్‌గా సూరిబాబు సేవలు మరువలేనివి

మునగపాక : సీడీసీ చైర్మన్‌గా సూరిబాబు ఎనలేని సేవలందించారని మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్ అన్నారు. మునగపాకకు చెందిన సీడీసీ మాజీ చైర్మన్ స్వర్గీయ ఆడారి సూరిబాబు వర్ధంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. సూరిబాబు చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ సీడీసీ చైర్మన్ పదవికే సూరిబాబు వన్నె తెచ్చారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దాడి ముసిలినాయుడు, రైతు సంఘ అధ్యక్షుడు ఆడారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



సీడీసీ మాజీ చైర్మన్ సూరిబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

దేవాలయాల్లో భజన కార్యక్రమాలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఫౌండేషన్ సభ్యులు

పాయకరావుపేట : ప్రతి దేవాలయంలోను ప్రతి వారం భజన కార్యక్రమాలు నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈ మేరకు సేవా ఫౌండేషన్ రాజగోపాలపురం గ్రామంలో మండల సమావేశం నిర్వహించారు. ప్రతి పౌర్ణమికి స్వామికి సామూహిక హారతి ఇవ్వాలన్నారు. ప్రతి దేవాలయంలో ఆధ్యాత్మిక శోభ కల్పించాలన్నారు. గ్రామాల్లో ఆలయాల్లో పూజలు, భజనలు, హారతులు ఇవ్వాలన్నారు. సమావేశంలో సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు చేపల అప్పలరాజు, మేడిశెట్టి దివాణం, గుజ్జు గోవిందరెడ్డి, కట్టా వీరబాబు పాల్గొన్నారు.

అతిసార నియంత్రించాలి

మునగపాక : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చూచుకొండ సర్పంచ్ దొడ్డి సూరప్పారావు కోరారు. అతిసార సోకకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం మండలంలోని చూచుకొండ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల పాటు గ్రామాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయం చేసుకొని అతిసార ప్రబలకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్తేర్‌రాణి, వినోద్‌కుమార్, ఎంపీటీసీ కిరణ్‌కుమార్, పాలసంఘ మాజీ అధ్యక్షుడు కాండ్రేగుల నాయుడు, పాలసంఘ అధ్యక్షుడు ఆడారి ప్రసాద్ , వైద్య సిబ్బంది శరగడం అప్పలనాయుడు కార్యక్రమంలో పాల్గొన్నారు.



చూచుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అతిసార నివారణపై అవగాహన అవసరం

అచ్యుతాపురం : మండలంలోని పలు చోట్ల 'డయేరియా ఆపండి' కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ మేరకు ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. హరిపాలెంలో వైద్యాధికారి కళ్యాణి ఆధ్వర్యంలో, ఆవసోమవరంలో వైద్యాధికారి వసంత కుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. డయేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమా మహేశ్వరరావు, శోభ, నాగేశ్వరరావు, ముకేశ్, రమణ పాల్గొన్నారు.



హరిపాలెంలో డయేరియాను నివారించండి కార్యక్రమం పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న వైద్య సిబ్బంది

4న విద్యా సంస్థల బంద్‌కు పిలుపు

పాయకరావుపేట : ఈ నెల 4వ తేదీన విద్యా సంస్థలు బంద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు తెలిపారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ పై దేశ వ్యాప్తంగా విద్యాసంస్థలు బంద్ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఏఐఎస్ఎఫ్ నాయకులు పట్టణంలో సోమవారం విలేకరులకు తెలిపారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.జగదీష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ బంద్‌కు పిలుపునిచ్చారు. వీరితో పాటు ఏఐఎస్ఎఫ్ డివిజన్ నాయకులు ఏసు, సిద్ధూ పాల్గొన్నారు.



విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులు అమలు చేయాలి

ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ నేత జీవీ రావు



సమావేశంలోమాట్లాడుతున్న యూనియన్ జాతీయ నేత జీవీ రావు

అనకాపల్లి: అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులకు గత ప్రభుత్వం నియమించిన కమలేష్ చంద్ర కమిటీ ప్రతిపాదించిన సిఫార్సులను అమలుచేసి, ఉద్యోగుల్ని ఆదుకోవాలని ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ జాతీయ నేత బీవీ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని కోడిగంటి గోవిందరావు భవన్‌లో సోమవారం యూనియన్ నూతన జిల్లా అధ్యక్షుడు ఎస్.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన డివిజన్ ద్వైవార్షిక సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. గ్రామీణ తపాలా ఉద్యోగులకు రూ.5 లక్షల గ్రాట్యుటీ, రూ.5 లక్షల వరకు కుటుంబ సభ్యులకు వైద్య బీమా, రూ.5 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలన్న కమిటీ సిఫార్సులపై ప్రభుత్వం తాత్సారం చేయడం దుర్మార్గమన్నారు. ఉద్యోగుల మాదిరే గ్రామీణ తపాల ఉద్యోగులకు వేతన సవరణ జరపాలని కోరినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. దీనికి వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా అత్యధిక సభ్యత్వం, గుర్తింపు పొందిన యూనియన్ అనేక పోరాటాలు నిర్వహిస్తూనే ఉందన్నారు. దాని ఫలితంగానే కొద్ది పాటైనా గ్రామీణ తపాలా ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందన్నారు. అంతకు ముందు జరిగిన యూనియన్ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా ఎస్.సతీష్‌కుమార్, కార్యదర్శిగా వి.దుర్గాప్రకాష్, కోశాధికారిగా పి.నూకరాజు దొర, ముగ్గురు ఉపాధ్యక్షులు, ఐదుగురు సహాయ కార్యదర్శులు, కోశాధికారి, సహాయ కోశాధికారులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు వైఎన్ భద్రం, మండల అధ్యక్షులు శ్రీరామదాసు అబ్బులు. కార్యదర్శి, వి.దుర్గాప్రసాద్, యూనియన్ నాయకులు గంగరాజు, కోన లక్ష్మణ పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేష్

రాంబిల్లి: పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.వెంకటేష్ అన్నారు. సోమవారం ఆయన యూనిక్ స్కూల్లో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆహారం తినే ముందు తప్పనిసరిగా చేతులను సబ్బు, హ్యాండ్ వాష్‌తో శుభ్రం చేసుకోవాలన్నారు. ఎంపీహెచ్‌వో రాజు, హెల్త్ సూపర్‌వైజర్ ధనరాజు, రిటైర్డ్ హెచ్‌ఎం ఎస్.నర్సింగరావు పాల్గొన్నారు.

4న బంద్‌ను జయప్రదం చేయాలి

యలమంచిలి : నీట్ పరీక్ష రాసి నష్టపోయిన విద్యార్థులకు మద్దతుగా ఈ నెల 4న జరిగే దేశ వ్యాప్త బంద్‌కు యలమంచిలి డివిజన్ పరిధిలో ఉన్న విద్యాసంస్థలు జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ యలమంచిలి డివిజన్ నాయకులు సోమవారం యలమంచిలిలో పిలుపునిచ్చారు. ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేసి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైద్య విద్యను వ్యాపారంగా మార్చే విధంగా వ్యవహరించారని, ఎంతో కష్టపడి చదివిన పేద, మధ్య తరగతి విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నీట్ పరీక్ష పేపరు లీకేజ్ వ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ నాయకులు సింహాద్రి , చరణ్, జగదీష్, తాతాజీ, చిన్న,ప్రసాద్ పాల్గొన్నారు.



యలమంచిలిలో బంద్‌కు పిలుపునిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ముమ్మరంగా వరిపోతలు

మాడుగుల: అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రైతులు ఖరీఫ్ వరి విత్తనాలు వేస్తున్నారు. ఇప్పటికే వరి నారుమడులు సిద్ధం చేశారు. వర్షాలు కురవడం వల్ల పక్షం రోజుల వ్యవధిలో వరినారు పెరిగే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఈ వర్షాలకు పెద్దేరు, తారకరామ, ఉరకగెడ్డ, జలాశయాల్లో నీటిమట్టం కొంత మేర ఆశాజనకంగా ఉంది. వరి విత్తనాలు చల్లుతున్నారు.

మంద కృష్ణమాదిగ కృషితో దివ్యాంగుల పింఛన్ పెంపు

కశింకోట: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ కృషి ఫలితంగానే దివ్యాంగులకు కేటగిరీ వారీగా పింఛన్లు పెరిగాయని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రుపల్లి వీరు యాదవ్ తెలిపారు. అనకాపల్లిలోని ఉడ్‌పేటలో వీరు యాదవ్ ఆధ్వర్యంలో సంఘం తరపున మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ కృషి, దివ్యాంగుల సంఘాల పోరాటాల ఫలితంగా సీఎం చంద్రబాబు పింఛన్ సొమ్మును మూడు కేటగిరీలుగా విభజించి, పెంచి దివ్యాంగులకు అందిస్తున్నారని తెలిపారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ కూడా పింఛన్ మొత్తాన్ని పెంచారని గుర్తు చేశారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మొల్లి చంద్రశేఖర్, ప్రతినిధులు కరణం శివ, యలమర్తి రవి, కోరుకొండ నాగరాజు, ధూళి శివ, చెట్టుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త చట్టాలను కేంద్రం వెనక్కి తీసుకోవాలి

తుమ్మపాల: దేశంలో కొత్తగా అమల్లోకి వచ్చిన మూడు క్రిమినల్ చట్టాలని వ్యతిరేకిస్తూ న్యాయవాదులు జిల్లా కోర్టు వద్ద నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎంజీవీఎస్ కుమార్ మాట్లాడుతూ కొత్త చట్టాలతో న్యాయవాదులే కాకుండా సామన్య ప్రజలు సైతం గందరగోళంలో పడుతున్నారని ఆక్షేపించారు. తక్షణమే ఈ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ చట్టాల రద్దుకు తదుపరి కార్యచరణ ఈ నెల 8న జరిగే విశాఖపట్నం బార్ అసోసియేషన్ సమావేశంలో నిర్ణయించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బందం నూకదుర్గారావు, న్యాయవాదులు పాల్గొన్నారు.



నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ట్రాఫిక్ ఎస్ఐ నర్సింగరావుకు సీఐగా పదోన్నతి

తుమ్మపాల: పట్టణంలో ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ నర్సింగరావు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందినట్లు సోమవారం డీఐజీ విశాఖపట్నం రేంజ్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. విశాఖపట్నం రేంజ్ పరిధిలో ఎస్ఐ నుంచి సీఐగా పదోన్నత ప్యానల్‌లో నర్సింగరావు పేరు రోస్టర్ పాయింట్‌లో ఉంది. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి.రోహిణిపతి జూన్ 30న పదవీ విరమణ కారణంగా ప్రస్తుతం ఖాళీలో భర్తీ చేయనున్నారు. ఈ మేరకు ప్రస్తుతం విధుల్లో ఉన్న పోస్టు నుంచి రిలీవ్ చేయాల్సిందిగా జిల్లా ఎస్పీని కోరారు.

రోటరీ క్లబ్‌లో రక్తదాన శిబిరం



రోటరీ క్లబ్‌లో రక్తదానం చేస్తున్న దాతలు

తుమ్మపాల: ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి ప్రాణదానం చేసినట్లేనని రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని రోటరీ క్లబ్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 43 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు పేర్కొన్నారు. విజయనగరం క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వరరావు ప్రోత్సాహంతో 2,425 యూనిట్లు సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. జిల్లాలో 84 క్లబ్స్ రక్తదానం శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ రాజేష్ కుమార్, సెక్రెటరీ అనిల్, కోశాధికారి సత్యేంద్ర, ఇతర క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.